సమస్యల పరిష్కారానికి కృషి


నార్సింగి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మణికొండ: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. అశోక్ యాదవ్ అధ్యక్షతన కోకాపేట చౌరస్తా నుంచి నార్సింగి చౌరస్తా వరకు పెద్ద ఎత్తున బైక్, కార్ల ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. అనంతరం రాత్రి నార్సింగి చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ గండిపేట మండలానికి డిగ్రీ, జూనియర్ కళాశాలను సీఎంతో మాట్లాడి మంజూరు చేయిస్తానన్నారు. అలాగే స్టేడియం నిర్మాణానికి కూడా చొరవ తీసుకుంటానన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పాడి పరిశ్రమాభివృద్ధి చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంషాబాద్: చేవెళ్లలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం సలహాదారు వేంరెడ్డి నరేందర్‌రెడ్డి కోరారు. శంషాబాద్, రాజేంద్రనగర్‌లోని బూత్ లెవెల్ నాయకులు, కార్యకర్తలతో పట్టణంలోని కేఎల్‌సీసీ కన్వెన్షన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటింటికీ తిరుగుతూ 100 రోజుల్లో కాంగ్రెస్ అమలు చేసిన గ్యారంటీలను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష లేని పారదర్శకమైన పాలనను అందిస్తున్నదని ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, శంషాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండ మున్సిపాలిటీలో ..

మణికొండ: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా మణికొండ మున్సిపాలిటీలో నాయకులు బృందాలుగా ఏర్పడి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు ఇందిర, సీనియర్ నాయకుడు సాయిరెడ్డి ఆధ్వర్యంలో మణికొండ గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, స్థానికంగా మున్సిపాలిటీ కాంగ్రెస్ చేతిలోనే ఉందని, అదే విధంగా ఎంపీ సైతం కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తి ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. నాయకులు బి.ముత్యాలు, రాజు, పి.సత్యనారాయణ, ప్రభావతి పాల్గొన్నారు.

బుద్వేల్‌లో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కోరని శ్యామ్ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు పెండ్యాల శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

నార్సింగిలో మోగిన
అవిశ్వాస నగారా

ఈ నెల 18న ప్రత్యేక సమావేశం
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్
- కౌన్సిలర్లకు నోటీసులు అందజేసిన అధికారులు
- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం
- 12 మంది సభ్యుల సంతకాలు



నార్సింగి మున్సిపల్ కార్యాలయం

మణికొండ: అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్కో మున్సిపాలిటీను తన ఖాతాలో వేసుకుంటోంది. ఇటీవలే నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతూ 12 సభ్యులు కలెక్టర్‌కు లేఖ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో సదరు లేఖను పరిగణలోకి తీసుకున్న కలెక్టర్ శశాంక వారి సంతకాల పరిశీలనను పూర్తి చేయించి ఈ నెల 18వ తేదీన రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. దాంతో నార్సింగి మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి కౌన్సిలర్లకు మున్సిపల్ చట్టం- 2019 , సెక్షన్ 37 ప్రకారం ప్రత్యేక సమావేశానికి హాజరై తమ బలం నిరూపించుకోవాలని శుక్రవారం నోటీసులు అందజేశారు.

ఆశలు వదులుకున్న బీఆర్‌ఎస్ వర్గం..!

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ తరహాలోనే నార్సింగిలోనూ అత్యధికంగా కౌన్సిలర్లు చైర్‌పర్సన్ రేఖాయాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్‌ను పదవీచ్యుతులను చేయాలని నిర్ణయించారు. మొత్తం 18 మంది సభ్యులు ఉన్న కౌన్సిల్‌లో అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే రెండింట మూడు వంతుల (12మంది) సభ్యుల బలం అవసరం ఉంటుంది. తమ పార్టీకే చెందిన నలుగురు కౌన్సిలర్లు ఏకంగా అవిశ్వాస తీర్మానం పత్రంపై సంతకాలు చేయడంతో పాటు వారిలో ముగ్గురు 2 రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దాంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల బలం గతంలో ఆరు ఉండగా ప్రస్తుతం 9 మందికి పెరిగింది. వారితో పాటు పార్టీలకు అతీతంగా బీజేపీ సభ్యులు పద్మవీరారెడ్డి, ఆర్. ఆదిత్య రెడ్డి, బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్ నిర్ణయించుకుని లేఖను అందజేశారు. దాంతో ప్రస్తుత చైర్మన్, వైస్ చైర్మన్ తమ పదవులపై ఆశలు వదులుకున్నట్లు తెలిసింది.

పార్టీ మారేందుకు సిద్ధపడినా..

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుత చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతున్నారని సమాచారం తెలుసుకున్న వారు తామే పార్టీ మారతామని, తమ పదవులు అలాగే ఉంచాలని రాయబారం చేసినట్లు సమాచారం. అందుకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ముంగి జైపాల్‌రెడ్డి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తమ పార్టీలో ఉన్న వారికే పదవులు ఇస్తామనే ఉద్దేశంతో వారి ప్రతిపాదనను తిరస్కరించినట్లు తెలిసింది. దాంతో చేసేదేమి లేక వారు మిన్నకున్నట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల హడావిడి ముగియగానే ఈనెల 18వ తేదీన అవిశ్వాసం సమావేశం నిర్వహించి ప్రస్తుత చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను పదవీచ్యుతులను చేసేందుకు 12 మంది కౌన్సిలర్‌లు సిద్ధంగా ఉన్నారు. అనుకున్నది అనుకున్నట్టుగా జరిగి ఇద్దరి పదవులు పోతాయా..? లేక మరేమైన ట్విస్టులు తెరమీదకు వచ్చి మరింత రంజుగా నార్సింగి రాజకీయం మారుతుందా..? అని తేలాలంటే ఈ నెల 18వ తేదీ వరకు వేచిచూడాల్సిందే.

ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు


మైలార్‌దేవ్‌పల్లి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న రాధారాణి

మైలార్‌దేవ్‌పల్లి: ఓటర్లకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పోలింగ్ బూత్‌ల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామని పోలింగ్ సెక్టర్ ఆఫీసర్ రాధారాణి పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఉడంగడ్డ , మైలార్‌దేవ్‌పల్లి పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ర్యాంపులు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే ఓటరు స్లిప్పులు ప్రతిఒక్కరికీ అందేలా చూడాలని బీఎల్‌వోలకు సూచించారు.

ఓటర్ల స్లిప్పుల పంపిణీ పరిశీలన..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పోలింగ్ బూత్‌లతో పాటు ఓటర్ల స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు అధికారిని రాధారాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని పోలింగ్ బూత్‌ల్లో స్లిప్పుల పంపిణీని పర్యవేక్షించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని అధికారులు, సిబ్బంది చేపడుతున్న కార్యక్రమాలకు పలు సూచనలు, సలహాలు చేసినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

శంషాబాద్: బీఆర్‌ఎసీ సీనియర్ నాయకుడు, శంషాబాద్ మండల మాజీ అధ్యక్షుడు, పెద్దతూప్ర గ్రామ మాజీ సర్పంచ్ తెరుపల్లి రమేశ్ శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ చేస్తున్న సంక్షేమ పాలనను చూసే చేరినట్లు తెలిపారు. రంజిత్‌రెడ్డిని గెలిపించుకునేందుకు కృషి చేస్తానన్నారు. ఆయనతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలు కూడా చేరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మణికొండ: విద్యుత్ హై టెన్షన్ వైర్లకు తగిలి గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిరేవుల హాల్ మార్క్ అపార్ట్‌మెంట్స్ వెనక వైపు ఉన్న హైటెన్షన్ వైర్లకు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు గల వ్యక్తి తగిలాడు, దాంతో విద్యుదాఘాతంతో అతని శరీరం మొత్తం కాలి చనిపోయాడు. స్థానికులు గమనించి సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. మృతుడి చేతికి కడియం, సిల్వర్ బ్రాస్‌లెట్ ఉన్నాయని, ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

మనూలో 'ఎంఏ ఎకనామిక్స్' దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎంఏ ఎకనామిక్స్, పీహెచ్‌డీ కోర్సుల కోసం అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించినట్లు 'మనూ' ఎకనామిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ తెలిపారు. మెరిట్ ఆధారిత కోర్సుల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను పంపాలన్నారు. దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ జూన్ 30 అని తెలిపారు. అదేవిధంగా ఎకనామిక్స్ పీహెచ్‌డీ ప్రవేశానికి దరఖాస్తునకు మే 20 ఆఖరు. దరఖాస్తుకు మనూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్ 6526900810, 8421932098 లలో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ టవర్‌ను ఢీకొట్టిన లారీ


కూలిన విద్యుత్ టవర్

మణికొండ: టవర్ లోడ్‌తో వెళ్తున్న ఓ కంకర లారీ అదుపు తప్పి మణికొండ మల్లన్న ఆలయం సమీపంలోని ఓ విద్యుత్ టవర్‌ను శుక్రవారం ఉదయం 6.45 గంటలకు ఢీ కొట్టింది. దాంతో అది పక్కకు ఒరిగిపోవడంతో మణికొండ, పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే స్పందించిన విద్యుత్ ఏఈ జ్ఞానేశ్వర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని టవర్‌కు ఉన్న విద్యుత్ వైర్లను మరో లైన్‌కు మళ్లించారు. దాంతో పుప్పాలగూడ సబ్‌స్టేషన్ పరిధిలో గంట వ్యవధిలోనే సమస్య పరిష్కారమయ్యింది. మణికొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మరో లైన్‌నుంచి సరఫరా ఇచ్చినా అది అధిక లోడుతో పలు చోట్ల వైర్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ కావటంతో 11 గంటల వరకు సమస్య ఏర్పడింది. వాటికి తిరిగి మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. లారీ ఢీకొన్న సమయంలో అక్కడ ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా లారీ నడిపిన డ్రైవర్‌పై నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశామని మణికొండ విద్యుత్ శాఖ ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. కూలిన టవర్ పునరుద్ధరణ పనులు రోజంతా కొనసాగాయని ఆయన పేర్కొన్నారు.

ఈవీ రంగం శరవేగంగా అభివృద్ధి

ఈవీ రెట్రాన్ ఎనర్జీస్ ఇండియా జీఎం దిపేశ్‌కుమార్

మణికొండ: ప్రపంచ వ్యాప్తంగా ఈ మొబిలిటీ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ఆ రంగంలో ఎలక్ట్రికల్ విభాగం ఇంజినీరింగ్ విద్యార్థులు దృష్టిపెట్టి అందులో మంచి ఉద్యోగావకాశాలను పొందాలని ఈవీ రెట్రాన్ ఎనర్జీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జీఎం దిపేశ్‌కుమార్ అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో వారం రోజులుగా ఎలక్ట్రికల్ వెహికిల్ టెక్నాలజీపై విద్యార్థులకు అందించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కార్యక్రమ కన్వీనర్ ఎం. బాలసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ రంగంలో వస్తున్న మార్పులకు ప్రభుత్వాలు తమవంతూ తోడ్పాటును అందిస్తున్నాయన్నారు. దాంతో ఆయా రంగాల్లో ఉత్పత్తి, ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయన్నారు. ఈవీ మార్కెట్ మరింత విస్తరించే ఉందని, అందులో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు డాక్టర్ టి. మురళీకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. సురేశ్‌ కుమార్, ప్రొఫెసర్ యూకే చౌదరి, సలహాదారు కె. కృష్ణవేణి, ప్రొఫెసర్ సురేశ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఈవీ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

కాసాని విజయం ఖాయం


కిస్మత్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్ తదితరులు

బండ్లగూడ: చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్, దర్గాఖలీజ్‌ఖాన్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని, నిరంతరం ప్రజల్లో ఉండే నాయకుడి కాసాని జ్ఞానేశ్వర్ అని అలాంటి నాయకుడిని ఎన్నుకుంటే పేద ప్రజల బతుకులు మారుతాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాగర్‌గౌడ్, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు అంతారం నరేశ్, సురేశ్‌గౌడ్, దయానంద్‌గౌడ్, గోపాల్, మల్లేశ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోకాపేటలో..

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో నార్సింగి బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ నాయకులతో కలిసి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాసాని జిల్లా ప్రజలకు రెండుసార్లు సేవలు అందించి, బీసీ నాయకుడిగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి పార్లమెంట్‌లో ఉంటే జిల్లా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తారన్నారు. ప్రచారంలో నాయకులు మల్లేశ్, హరిశంకర్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- (ఎంజీఐటీ) కళాశాలలో అవగాహన


ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మణికొండ: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని తప్పకుండా వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో కళాశాల ఎలక్టోరల్ లిట్రసీ క్లబ్, ఎన్ఎస్ఎస్ విభాగం, యంగీస్థాన్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు అందుబాటులో పోలింగ్ కేంద్రాలు అలాగే సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈసారి ఎండలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ సమయాన్ని సైతం ఎన్నికల కమిషన్ సాయంత్రం ఆరు గంటల వరకు పెంచిందని తెలిపారు. అనువైన సమయంలోనే పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ ఎన్నికల నోడల్ అధికారులు బి. శరత్‌చంద్ర, శ్రీలీల, యంగీస్థాన్ ఫౌండేషన్ ఫౌండర్ వై.అరుణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ జి. చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

దేశాన్ని అగ్రభాగంలో నిలపడమే లక్ష్యం

బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి


లక్ష్మీనగర్ పార్కులో మార్నింగ్ వాకర్స్‌ను కలిసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

రాజేంద్రనగర్: 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రభాగాన నిలపడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అత్తాపూర్ డివిజన్ లక్ష్మీనగర్ పార్కులో మార్నింగ్ వాకర్స్‌ను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోబోతున్న యువతీ, యువకులు తమ అమూల్యమైన ఓటును దేశానికి గర్వకారణంగా నిలుస్తున్న నరేంద్ర మోదీకి మాత్రమే వేయాలని కోరారు.

రంజిత్ రెడ్డి కుట్రలు ఎదుర్కొంటా..

తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి కుట్రలు మొదలు పెట్టారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు. చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేరు గల నలుగురు అభ్యర్థులను నిలబెట్టి ప్రజలను అయోమయానికి గురి చేసే కుట్రలు జరుగుతున్నాయన్నారు. రంజిత్ రెడ్డి ఎంత ప్రయత్నించినా తన విజయాన్ని అడ్డుకోలేరన్నారు. నియోజకవర్గానికి చెందిన బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడికె రాజు స్థానిక నాయకులు సంరెడ్డి ప్రమోద్‌రెడ్డి, అడికె మహేందర్‌తో కలిసి ఇంటింటికీ తిరుగుతూ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన పనులు, పథకాలను ప్రజలకు వివరించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

అంబేడ్కర్ కాలనీలో..

రాజేంద్రనగర్: అంబేడ్కర్ కాలనీలో రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి డాక్టర్ ప్రేమ్‌రాజ్ పాల్గొని మాట్లాడారు. 'అబ్‌కీ బార్ చార్ సౌ పార్... ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్' అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేశ్ యాదవ్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు డి.సత్యనారాయణ, పవన్ రాజ్, పి.రవీందర్, ఇ.వేణుగోపాల్, భాస్కర్ యాదవ్, పెంటయ్య, జంగయ్య, శేషి రఘుమా రెడ్డి, బాబు, అరుణ్, స్వామి, లక్ష్మీనారాయణ, రమాదేవి పాల్గొన్నారు.

పెద్ద తాళ్లకుంట పార్కులో..

రాజేంద్రనగర్: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి శుక్రవారం పెద్ద తాళ్లకుంట పార్కులో మార్నింగ్ వాకర్స్‌ను, యోగా మెంబర్స్‌ను కలిశారు. కార్యక్రమంలో పెద్ద తాళ్లకుంట పార్కు అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, యోగా మాస్టర్ సునీల్ బిరాదర్, నారగూడెం మల్లారెడ్డి, విజయ్ కుమార్, శ్రీనివాస్, జంగయ్య, లక్ష్మారెడ్డి, హరి, నితిన్, వసుదేవా రెడ్డి, రమేశ్ నాయక్, బాల్ రెడ్డి పాల్గొన్నారు.

హైదర్‌గూడ ఓల్డ్ విలేజ్‌లో..

అత్తాపూర్ : అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ ఓల్డ్ విలేజ్‌లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో బీజేపీ నాయకులు

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- పార్టీ కార్యాలయం ప్రారంభం


బండ్లగూడలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పార్టీ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలన్నారు. ప్రజల్లోకి వెళ్లి బీఆర్‌ఎస్ చేసిన పనులను ఓటర్లకు వివరించాలన్నారు. కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అంతారం నరేశ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, నాయకులు సురేశ్‌గౌడ్, పాండు, పాపయ్యయాదవ్, చేవెళ్ల యాదిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, డాక్టర్ నవాబ్‌ముంతాజ్, మలాకీ రత్నం, రజాక్‌భాయ్, జగదీశ్, వెంకటేశ్, సుమన్‌గౌడ్, యూత్ ప్రెసిడెంట్ మల్లేశ్‌యాదవ్, సుందర్‌గౌడ్, నర్సింహగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్తాపూర్ హైదర్‌గూడలో..

రాజేంద్రనగర్: అత్తాపూర్ హైదర్‌గూడలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా అత్తాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ప్రచారాన్ని నిర్వహించారు. కొలను సుభాష్ రెడ్డి, చిన్న నరేందర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు వనం శ్రీరాం రెడ్డి, కార్తీక్ గౌడ్, రవీందర్ గౌడ్, చిత్తారి, యాదగిరి, లక్ష్మణ్, అమరేందర్, యువ నాయకులు సంతోష్ గౌడ్, బంగి శ్రీనివాస్, చెన్నయ్య, జైహింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఆదరణ ఎమ్మెల్యే

బండ్లగూడ: బీఆర్‌ఎస్‌కు ఆదరణ పెరుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎంసీపీఐ కంటెస్టెడ్ ఎమ్మెల్యే హరీశ్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సర్వేపల్లి రాజశేఖర్ తన అనుచరులు 100 మంది కార్యకర్తలతో కలిసి బండ్లగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు నమ్మకం కోల్పోయారని, మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. హరీశ్‌గౌడ్, సర్వేపల్లి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున పోరాడుతామని తెలిపారు. అలాగే కాసాని విజయం కోసం కష్టపడి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డోల్ బజాకే.. ఓట్ పూఛ్‌తే



మణికొండ : ఎన్నికలకు మరో 10 రోజుల సమయం మాత్రమే ఉండడంతో ప్రచారం జోరందుకుంది. అందులో భాగంగా మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్లు పి.శైలజ, బి. కావ్యతో పాటు నాయకులు లక్ష్మీశ్రీ, సరోజినీ శుక్రవారం ప్రచారంలో భాగంగా వారే డోలు కొట్టి సరదాగా ఓటు అడిగారు.